# నేడు నారాభువనేశ్వరి కుప్పం పర్యటన



శాంతిపురం, మార్చి 13 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శనివారం కుప్పం పర్యటనలో భాగంగా శాంతిపురం మండలంలో పర్యటించను న్నారు. ఉదయం 9గంటలకు హైదరాబాద్‌నుంచి బయలుదేరి 10.20గంటలకు బెంగళూరు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడనుంచి రోడ్డు మార్గంలో రాళ్లబూదుగూరు గ్రామం చేరుకుని శ్రీ కోదండరాములవారి రథోత్సవంలో పాల్గొంటారు. అనంతరం అక్కడనుంచి బయలుదేరి కదిరిముత్తన పల్లిలో జరుగుతున్న శ్రీ సిద్ధేశ్వరస్వామి పెద్ద దేవరలో పాల్గొని మరలా తిరుగుప్రయాణం అవుతారు.

తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# కన్నులపండుగా స్వామి అమ్మవార్ల ఊంజల్‌సేవ



శ్రీకాళహస్తి, మార్చి 13 ప్రభాతవార్త

కన్నులపండువగా స్వామిఅమ్మవార్ల ఊంజల్‌సేవను శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం స్వామిఅమ్మవార్లను ఆలయం వెలుపలకు తీసుకువచ్చి స్వామిఅమ్మవార్లను ఉయ్యాలపై ఎదురెదురుగా ఆశీనుల్ని చేశారు. అనంతరం ఊంజల్‌సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాధికారులు పాల్గొన్నారు.

# దోపిడియత్నం కేసును 24 గంటల్లో ఛేధించిన పోలీసులు

## - నిందితుల నుండి తుపాకీలు, కత్తులు స్వాధీనం
## - 7 మంది నిందితులు అరెస్టు- ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు, మార్చి 13 ప్రభాతవార్త:

చిత్తూరు నగరం గాంధీరోడ్డులోని ఓ ఇంట్లో బుధవారం తెల్లవారుజాము తుపాకులు, కత్తులతో వెళ్లి దోపిడి చేయడానికి యత్నించిన కేసును పోలీసులు 24 గంటల్లో ఛేధించి ఏడు మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరించారు. నంద్యాల, అనంతపురం, కర్నూలు జిల్లాలకు చెందిన క్రిమినల్ రికార్డులు వున్న ఏడు మంది నిందితులు గాంధీరోడ్డులోని ఓ ఇంట్లో దోపిడికి యత్నించి పట్టుబడ్డారు. చిత్తూరు పోలీసు గెస్ట్‌హౌస్‌లో ఎస్పీ మణికంఠ చందోలు గురువారం విలేకరులకు కేసు వివరాలను వెల్లడించారు. నంద్యాలకు చెందిన పసుపులేటి సుబ్రమణ్యం(52) క్రిమినల్ స్వభావం కల్గిన వాడని నంద్యాల పోలీస్ స్టేషన్‌లో ఇతనిపై ఆరు కేసులు వున్నాయని, ఒక దోపిడి కేసులో 10 సంవత్స రాలు జైలు శిక్ష అనుభవించి వచ్చి ప్రస్తుతం చిత్తూరులో ఎస్‌ఎల్‌వి ఫర్నిచర్ దుకాణంను నిర్వహిస్తున్నాడన్నారు. సుబ్రమణ్యం చిత్తూరు నగరంలో దోపిడి చేయడానికి తనకు తెలిసిన క్రిమినల్స్‌ను నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాల నుండి రప్పించి గాంధీరోడ్డులోని పుష్ప కిడ్స్ షాపు యాజమాని చంద్రశేఖర్ ఇంటిని టార్గెట్ చేశారన్నారు. చంద్రశేఖర్ ఇంటిలో దోపిడి చేయడానికి ఏడు మంది నిందితులు బుధవారం ఉదయం 5.30 గంటలకు చేరుకున్నారని, ఉదయం 6.10 గంటలకు చంద్రశేఖర్ భార్య శాంతి డోర్ తీసుకుని బయటికి రాగా అప్పటికే బయట సిద్ధంగా వున్న సుబ్రమణ్యం, అతని గ్యాంగ్ సభ్యులు తుపాకీ, కత్తులతో ఆమెను బెదిరించి ఇంట్లోకి తీసుకెళ్ళి డబ్బులు, బంగారం గురించి బెదిరిస్తుం



డగా అప్పుడే లేచిన ఆమె భర్త చంద్రశేఖర్, ఆమె కుమారుడు అక్కడికి వస్తే సుబ్రమణ్యంపై చంద్రశేఖర్‌తో పాటు అతనితో వచ్చిన నిందుతులు కత్తులతో తల, చేతిపై గాయం చేశారన్నారు. వీరి నుండి తప్పించుకున్న చంద్రశేఖర్ బయటికి వచ్చి కేకలు వేయడంతో పాటు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడే కింద వున్న స్థానికులు అక్కడికి చేరుకుని ఒక భవనం నుండి మరొక భవనంపైకి దూకి పారిపోవడానికి ప్రయత్నించారన్నారు. ఈ ప్రయత్నాల్లో గోడ దూకిన సుబ్రమణ్యం కిందపడిపోవడంతో అతని కాలికి గాయం అయ్యిందని, మిగిలిన ముగ్గురు నిందితులను పోలీసులు పట్టుకోవడం జరిగిందన్నారు. దోపిడి దొంగల వద్ద తుపాకులు, కత్తులు వున్నాయని సమాచారం అందడంతో పోలీసులు బుల్లెట్ ఫ్రూఫ్ జాకెట్లు ధరించి రంగంలోకి దిగారని, అప్పటికే మిగిలిన ముగ్గురు పారిపోయారన్నారు. పోలీసు జాగిలాలను తీసుకువచ్చి వెతికినప్పటికీ మిగిలిన వారి జాడ కన్పించకపోవడంతో పట్టుబడిన వారిని స్టేషన్‌కు తీసుకెళ్ళి విచారించడం జరిగిందన్నారు. ఈ విచారణలో ఇంట్లో దోపిడి చేయడానికి మొత్తం ఏడు మంది వెళ్ళడం జరిగిందని, మిగిలిన వారు వివరాలను వెల్లడించడంతో పోలీసులు మిగిలిన వారిని వెలికి పట్టుకుని అరెస్టు చేయడం జరిగిందన్నారు. నిందితుల్లో చంద్రశేఖర్‌కు గాయం కావడంతో అతనిని పోలీసులు ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారని మిగిలిన ఆరు మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. నిందితుల్లో నంద్యాలకు చెందిన సుబ్రమణ్యంపై నంద్యాల పోలీస్ స్టేషన్‌లో 6 కేసులు వున్నాయని, ఒక కేసులో 10 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించి రావడం జరిగిందని ఇతను ప్రస్తుతం చిత్తూరులో ఎస్‌ఎల్‌వి ఫర్నిచర్ షాపును నిర్వహిస్తున్నాడరన్నారు. మరో నిందితుడు కడప జిల్లా ప్రొద్దటూరుకు చెందిన ఎస్. ఇబ్రహీం(34) ప్రస్తుతం నంద్యాల జిల్లా శ్రమదానంలో నివాసం వుంటున్నాడు. అలాగే మరో నిందితుడు నంద్యాల జిల్లా బర్మశాలకు చెందిన నవీన్‌కుమార్(39), అనంత పురం జిల్లా రామాపురం జారుట్లకు చెందిన దొమ్మర రామాంజ నేయులు(26), దొమ్మర రాజశేఖర్(21), దొమ్మర నెట్టికంఠయ్య(18), నంద్యాల జిల్లా బొమ్మల సత్రంకు చెందిన కుంచం సంపత్‌కుమార్ (40)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ మణికంఠ చందోలు వెల్లడించారు. ప్రాణాలకు తెగించి ఆపరేషన్ నిర్వహించి నిందితులను పట్టుకోవడం జరిగిందని, స్థానికులు సహకారం అం దించారని అభినందించారు. పోలీసులకు ఎస్పీ మణికంఠ చందోలు ప్రసంశాపత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో ఆపరేషన్స్ ఎఎస్పీ రాజశేఖరరాజు, ఏఆర్ ఎఎస్పీ శివానందకిషోర్, చిత్తూరు డిఎస్పీ సాయినాథ్, ఏఆర్ డిఎస్పీ మహబూబ్‌భాషా, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య, వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు, వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## బయోడైవర్సిటీ

# పార్కులు ఏర్పాటు చేస్తాం

## చైర్మన్ నీలాయ పాలెం విజయ్ కుమార్

తిరుపతి విద్య మార్చి 13 ప్రభాత వార్త



అంతరించి పోతున్న జీవ జాతుల సంరక్షణ లక్ష్యంతో తిరుపతి, అమరా వతి,వైజాగ్‌లలో బయో డైవర్సిటీ పార్కులను ఏర్పాటు చేయ బోతున్నాం అని రాష్ట్ర బయోడైవర్సిటీ చైర్మన్ నీలా యపాలెం విజయకుమార్ తెలిపారు. తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్లో గురువారం విలేకరులతో మాట్లాడుతూ తిరుపతిలో బయో డైవర్సిటీ పార్క్ ఏర్పాటు కోసం జిల్లా కలెక్టర్ కలిశామని,తిరుపతి పరిసరాల ప్రాంతంలో నాలుగు చోట్ల స్థలాన్ని సూచించారని,రేవు నీ అధికారులు దీనిని నిర్ధారించిన తర్వాత తాము సందర్శించిన నాలుగు ప్రాంతంలో ఎక్కడో ఒకచోట 10 నుంచి 15 ఎకరాల స్థలంలో బయో డైవర్సిటీ పార్క్ ను ఏర్పాటు చేస్తామన్నారు. తిరుమల జాపాలీ తీర్థం, పుత్తూరు దగ్గర కైలాస కోనలను బయో డైవర్సిటీ పవిత్ర ప్రదేశాలుగా డిక్లేర్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి రెకమెండేషన్ చేస్తున్నాం అన్నారు.తలకోన, కపిల తీర్థం లను బయో డైవర్సిటీ హెరిటేజ్ సైట్స్ గా డిక్లేర్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి రెకమండేషన్ చేశాం అన్నారు.14,15 తేదీల్లో ఏపీ,తెలంగాణ, తమిళనాడు,కర్నాటక రాష్ట్రాల ప్రతినిధులతో ఎర్ర చందనం మీద జాతీయ నిపుణుల కమిటీ సమావేశం తిరపతి మానససరోవర్ హోటల్లో నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 14వేల పంచాయితీల్లోని జీవ వైవిద్య యాజమాన్య కమిటీ సభ్యులకు, ఉపధ్యాయులకు ఏప్రిల్ నుంచి పెద్ద ఎత్తున శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం అని తెలిపారు.అటవీ, గ్రామీణ ప్రాంతాల్లో వనమూలికలు సేకరించే కంపెనీలు బయో డైవర్సిటీ బోర్డుకు అయిదు శాతం పన్ను చెల్లించాలి.అందుకు సంబంధించి సంబంధిత నిర్వాహకులకు నోటీసులు అందజేస్తామన్నారు.రాందేవ్ బాబా వంటి వారు నిర్వహిస్తున్న సంస్థలు సైతం పన్ను చెల్లించాల్సిందే అని అన్నారు.అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఎర్రచందనాన్ని,ప్రభుత్వ అనుమతితో దశలవారీగా వేలం వేస్తున్నారని,ఆ వేలం వేసిన డబ్బులను 60 శాతం రాష్ట్ర ప్రభుత్వానికి,35 శాతం కేంద్ర ప్రభుత్వానికి, మిగిలిన ఐదు శాతం బయోడైవర్సిటి బోర్డుకు రావాలన్నారు.ఎర్రచందనం విక్రయించినా అందులో నుంచి కూడా అయిదు శాతం బయో డైవర్సిటీ బోర్డుకు రావాలి అని,అందుకు తగ్గ చర్యలు తీసుకుంటాం అన్నారు.

## మామండూరు ఫారెస్టును

# సుందరమైన ప్రాంతంగా తీర్చిదిద్దుతాం

## - జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్




రేణిగుంట, మార్చి 13 ప్రభాతవార్త :

మామండూరులోని ఫారెస్టు ఏరియాను సందర్శించి సుందరమైన ప్రాంతంగా తీర్చిదిద్ది ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకుని వస్తాము అని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం రేణిగుంట మండలంలోని మామండ ూరు ఫారెస్టు ఏరియాలోని పలు ప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శేషాచలం బయోస్ఫియర్ రిజర్వులోని శ్యామల వ్యాలీలోని మామండూరు కమ్యూనిటీ బేసిడ్ టూరిజంను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సుమారు ఇక్కడ వంద సంవత్సరాల క్రితమే అటవీశాఖ భవనాలు ఉన్నాయి. దట్టమైన ఈ అడవులలో సుమారు 80కి పైగా చిరుతపులులు, ఏనుగుల విహారం, 40 పక్షి జాతులు మనకి ఇక్కడ అరుదైన పక్షి జాతులు ఉన్నాయి. సుమారు నెలకు 6,7 వేల మంది ఈ పర్యాటక ప్రాంతాన్ని సందర్శించడం జరుగుతుందన్నారు. ఈ పర్యాటక ప్రాంతాన్ని సందర్శించడానికి సందర్శకుల కోసం సఫారి ఏర్పాట్లు అటవీశాఖ అధికారులు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పర్యాటక ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి కమ్యూనిటీ బెస్ట్ ఏకో టూరిజంగా మోడల్‌లో సస్టైనబుల్ టూరిజంగా అభివృద్ధి చేసి ఇంకా ఎక్కువ మంది పర్యాటకులను ఆకర్షించే లాగా సఫారి, వాచ్ టవర్, సరస్సులు చాలా అద్భుతంగా ఉన్నాయని తెలిపారు. త్వరలో ఈ ప్రాంతాన్ని సుందరమైన ప్రాంతంగా తీర్చిదిద్దామని ప్రజలందరికి అందుబాటులోకి తీసుకుని వస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, ఐఎఎస్ గూడూరు సబ్ కలెక్టర్ రాఘ వేంద్ర మీనా, రేణిగుంట తహశీల్దార్ సురేష్‌బాబు, సంబంధిత అటవీశాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంకులో ఇంటి దొంగ అరెస్టు

## 2 కోట్ల 80 లక్షలు మాయం చేసిన అసిస్టెంట్ మేనేజర్

సత్యవేడు, మార్చి 13 ప్రభాతవార్త:

సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సంబంధించి ఇంటి దొంగల దోపిడీ కేసులో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న నిందితుడు ఆరవ సూర్యతేజను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం సత్యవేడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో సీఐ మురళి ఆధ్వర్యంలో నిందితున్ని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నాగలాపురం యూనియన్ బ్యాంకులో చోటు చేసుకున్న బంగారు నగల తాకట్టు రుణాల దుర్వినియోగంపై సంబంధిత డిప్యూటీ రీజినల్ మేనేజర్ బ్రహ్మయ్య నాగలాపురం పోలీస్‌స్టేషన్‌లో గత నెల 21 తేదీ ఫిర్యాదు చేశారన్నారు. అయితే బ్యాంకు వార్షిక తనిఖీల్లో భాగంగా గత నెల 10వ తేదీ శ్రీ రాజకమల్నాయక్ వచ్చిన అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్ ఆరవసూర్య తేజ బ్యాంకు రాకుండా గైర్హాజరు అయ్యారన్నారు. దీంతో ఆడిటర్ ఫోన్‌లో సంప్రదించగా నేరం ఒప్పుకోవడంతో అవాక్కయ్యారన్నారు. ఈ నేపథ్యంలో దీనిపై కేసు నమోదు చేశారు. యూనియన్ బ్యాంకులో 3496 మంది ప్రజలకు సంబంధించి వారి అవసరాలు నిమిత్తం తాకట్టు పెట్టి 47.67 కోట్లు రుణం పొందారన్నారు. బ్యాంకులో నగల తనకా, భద్రపరిచే ఐరన్ సేఫ్‌కు కస్టోడియన్లగా మేనేజర్‌గాపని చేస్తున్న తిరైవరాజు, అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న ఆరవ సూర్యతేజ వ్యవహరిస్తారన్నారు. అయితే బ్యాంకు మేనేజర్‌గా పని చేస్తున్న తిరైవరాజు బాధ్యతను విస్మరించి నిర్లక్ష్యం వహించడం వల్ల దీన్ని ఆసరా చేసుకుని అసిస్టెంట్ మేనేజర్ ఆరవ సూర్యతేజ 30 మంది బంగారు నగలను(2634 గ్రాములు) బ్యాంకు నుంచి దొంగతనంగా బయటికి తీసుకెళ్లినట్టు ఆయన తెలిపారు. ఈ క్రమంలో పుత్తూరులోనే ముత్తూట్, ఐఐఎఫ్ఎల్ వంటి ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకు ఆఫ్ బరోడా ఊత్తుకోట మహారాజా, వంటి బ్యాంకులు, ప్రేమలత, విగ్నేష్, సుమన్ వంటి కుదవ దుకాణాల్లో నగలను తాకట్టు పెట్టి రూ.1 కోటి 35 లక్షల రూపాయలురుణం తీసుకున్నట్లు ఆయన వివరించారు. ఇదేగాక 11 మంది పేర్లపైన ఉన్న బంగారు నగలను యూనియన్ బ్యాంకులోనే పదే పదే మార్చి తాకట్టు పెట్టి దాదాపు రూ.1 కోటి 30 లక్షల రూపాయలు అసిస్టెంట్ మేనేజర్




కొట్టేశారన్నారు. ఈ మొత్తం రూ.2 కోట్ల 80 లక్షలను ఆన్‌లైన్ క్యాసినో జూదంలో పోగొట్టుకున్నట్టు విచారణలో తెలియవచ్చింద న్నారు. దీనిపై కూడా సైబర్ నిపుణులతో లోతైన విచారణ చేస్తున్నా మన్నారు. బంగారు నగల తాకట్టుకు సంబంధించిన రసీదులను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా బంగారు నగల రికవరీ సంబంధించి చర్యలు ఉంటుందన్నారు. సస్పెండ్ అయిన గూడూరుకు చెందిన అసిస్టెంట్ మేనేజర్ ఆరవ సూర్యతేజ 2023 మే నెలలో బెంగళూరు నుంచి నాగలాపురంకు బదిలైనట్టు ఆయన పేర్కొన్నారు. అలాగే తమిళనాడు సేలంకు చెందిన బ్యాంకు మేనేజర్ తిరైవరాజు పాత్రపై కూడా విచారణ జరుపుతున్నామన్నారు. ఆన్‌లైన్ ఆటలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. బ్యాంకు మేనేజర్లే ఇందులో చిక్కుకుని కేసు నమోదైన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. కాగా సస్పెండ్‌కు గురై అరెస్టు చేసిన అసిస్టెంట్ మేనేజర్, నిందితుడు ఆరవ సూర్యతేజను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

# నేడు శ్రీ సిద్ధేశ్వరస్వామి పెద్ద దేవర

## - 5లక్షల దాకా భక్తులు వస్తారని అంచనా. !!
## - తొమ్మిదేళ్లకు జరుగుతున్న కురబకులస్తుల జాతర..
## - ఇప్పటికే హాజరైన వేలాది జనం !!



శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయం. ఇన్‌సెట్లో స్వామివారు.. తాత్కాలికంగా ఏర్పాటుచేసుకున్న గుడారాలు

శాంతిపురం, మార్చి 13 ప్రభాతవార్త

కురబ కులస్తులు తమ ఆరాధ్య దైవం శ్రీ సిద్ధేశ్వరస్వామి వారికి తొమ్మిదేళ్ల అనంతరం నిర్వహిస్తున్న పెద్ద దేవరకు ఏరా ్పట్లు పూర్తయ్యాయి. శాంతిపురం మండలం కొలమడుగు పంచాయతీ కదిరిముత్తనపల్లి గ్రామంలో వెలసిన శ్రీ సిద్ధేశ్వరస్వామి, శ్రీ బీరేశ్వరస్వామి, శ్రీ బత్తేశ్వరస్వామి, శ్రీరేవణసిద్ధేశ్వనస్వామి, శ్రీ చెన్నకేశవస్వామిల పెద్ద దేవర ఉత్సవాలు గత మూడు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం పెద్ద దేవరలో కీలక ఘట్టం నిర ్వహిస్తారు. మొక్కులు కలిగిన భక్తులు తమ తలలపై సంప్రదాయాన్ని అనుసరిస్తూ టెంకాయలను తలలపై పగలగొట్టుకునే కార్యక్రమంను పెద్ద ఎత్తున జరపనున్నారు. అలాగే పెద్దల పేరిట బట్టలు పెట్టడం, విందు భోజనాల కార్యక్రమాలు నిర్వహిస్తారు. కాగా ఈ ఉత్సవాలకు ఇప్పటికే వేలామంది భక్తులు హాజరు కాగా శుక్రవారం నాటికి దాదాపు నాలుగైదు లక్షల మంది వచ్చే అవకాశం ఉందని ఆలయ కమిటీ, అధికారులు అంచనాలు వేస్తున్నారు. నలభై గోత్రాలకు చెందిన కురబ కులస్తులు హాజరవుతున్నారు. పెద్ద దేవర కోసం కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాలనుంచి కురబ కులస్తులు ఇప్పటికే విచ్చేసి దాదాపు రెండువేల గుడారాలు ఏర్పాటుచేసుకున్నారు. కాగా ఇక్కడ ప్రత్యేకత ఏమిటంటే స్వామివారు ప్రతిచోట లింగాకారంలో ఉంటుండగా కదిరిముత్తనపల్లి ఆలయంలో మాత్రం విగ్రహ రూపంలో దర్శనమిస్తారు.

**దేవరకు భారీ ఏర్పాట్లు :** పెద్ద దేవరకు భారీ ఎత్తున భక్తులు హాజరయ్యే అవకాశం ఉండడంతో ప్రభుత్వ శాఖల అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామానికి ఐదు కి.మీ.ల దూరం నుంచే ప్రత్యేక విద్యుత్ స్థంభాలు, లైట్లు ఏర్పాటుచేశారు. మరో పక్క మంచినీరు, మరుగుదొడ్ల వసతి సమకూర్చారు. వేసవి దృష్ట్యా ఆరోగ్య శిబిరాలను సైతం నిర్వహిస్తున్నారు.

# కుప్పంలో పాడిపరిశ్రమ అభివృద్ధికి చర్యలు

## - కడ పి.డి. వికాస్ మర్మత్
## - ఆవులకు ఉచితంగా లింగనిర్ధారిత కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు



కుప్పం, మార్చి 13 ప్రభాతవార్త

కుప్పంలో పాడిపరిశ్రమ అభివృద్ధికి సిఎం చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టారని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని దాసేగానూరులో పశుసంవర్ధకశాఖ ద్వారా రాష్ట్రీయ గోకుల్ మిషన్ అధ్వర్యంలో ఆవులకు ఉచిత కృత్రిమ గర్భధారణ సీరం ఇంజక్షన్ల కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా పి.డి. మాట్లాడుతూ రూ 1300ల విలువ చేసే లింగ నిర్ధారిత కృత్రిమ గర్భధారణ సీరం ఇంజక్షన్లను పాడి ఆవులకు ప్రభుత్వం తరపున ఉచితంగా వేస్తున్నట్లు చెప్పారు. తద్వారా పేయ (ఆడ)దూడలు జన్మిస్తాయన్నారు. దీంతో పాడి పరిశ్రమఅభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్, ఇడి డా॥ బాలసుబ్రమణ్యం, ఎడి డా॥రెడ్డికుమారి, డా॥ సతీష్‌కుమార్,ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డా॥హరికృష్ణ, డా॥ ఖలీఫా మొయినుద్దీన్, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, నేతలు అశోక్‌కుమార్, వెంకటాచలంగౌడు, రైతులు పాల్గొన్నారు.

# లాహిరి..లాహిరిలో....

## ముగిసిన తెప్పోత్సవాలు



తిరుమల,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి:

ఫాల్గుణ మాసం...పౌర్ణమి ఘడియల్లో ఐదురోజులు పవిత్ర స్వామిపుష్కరిణిలో జరిగిన సాలకట్ల తెప్పోత్సవాలు గురురాత్రి కన్నుల పండువగా ముగిశాయి. చివరిరోజు సాయంత్రం నిత్యకైంకర్యాలు పూర్తిచేసుకున్న ఉత్సవర్లు శ్రీదేవి భూదేవిసమేతుడై మలయప్పస్వామి తెప్పపై ఏడుసార్లు పుష్కరిణిలో విహరించారు. అంతకుముందు ఇక్కడ మంగళవాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులను తెప్పపై కొలువు దీర్చారు. పెద్దజీయంగారు, చిన్నజీయం గారు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, విజిలెన్స్ వింగ్ వివిఎస్‌ఓ ఎన్టీవిరామ్‌కుమార్, ఇఇలు సుబ్ర మణ్యం, సుధాకర్, డిఇ చంద్రశేఖర్, ఆలయ ఏవిఎస్‌ఓ రాజశేఖర్ కర్పూర హారతులిచ్చి తెప్పను కదిలించారు. పుష్కరిణిలో నిరీక్షిస్తున్న భక్తులు, టిటిడి ఉద్యోగులు, గృహస్థభక్తులు గోవింద నామస్మరణలు చేయగా దేవదేవుడు అధిరోహించిన తెప్ప పుష్కరిణిలో రాత్రి 7గంటలకు ప్రదక్షణ చేసింది. అన్నమయ్య ప్రాజెక్టు కళాకారులు సంకీర్తనలు ఆలపించగా భక్తులు స్వరం కలిపారు. పుష్కరిణి గోవిందనామాలతో పులకించింది. పుష్కరిణి చుట్టూ విద్యుద్దీపకాంతులు దశావతారాల కటౌట్లు ఆకట్టుకున్నాయి. చివరిరోజు తెప్పోత్సవాల్లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటనారాయణభట్టి దంపతులు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకున్నారు.

# రీ సర్వేలో పొరబాట్లు సరిదిద్దటానికే మళ్ళీ రీ సర్వే

తొట్టంబేడు,మార్చి 13 ప్రభాతవార్త



రైతుల భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు రీసర్వే ప్రక్రియను చేపట్టామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వ రన్ అన్నారు. గురువారం తొట్టంబేడు మండలం బోనుపల్లి గ్రామం లో రీ సర్వేను చేపట్టారు. క్షేత్ర స్థాయిలో ఏం జరుగు తుందో తెలుసుకోవటానికి చర్యలు చేపట్టామని కలెక్టర్ వివరించారు. ఆయన ఈ గ్రామంలో గతంలో జరిగిన సర్వేను రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బోనుపల్లి గ్రామంలో గతంలో జరిగిన రీసర్వే ప్రక్రియలో దొర్లిన తప్పులను సరి చేసి పక్కాగా సర్వే చేపట్టుటకు చర్యలు తీసుకున్నామ న్నారు.రైతుల భూ సమస్యల పరిష్కార దిశగా రీసర్వే ప్రక్రియను చేపట్టామని వివరించారు. గత మాసంలో రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అత్యధిక శాతం వస్తున్న సమస్యలు భూ సమస్యలే ఎక్కుగా ఉన్నాయన్నారు. ఇదివరకు జరిగిన రీ సర్వేలో దొర్లిన తప్పుల వలన గందరగోళ పరిస్థితి చోటు చేసుకుందన్నారు. ఆ తప్పులను సరి చేసి పక్కాగ సర్వే చేయటం జరుగుతుందని వివరించారు. రీ సర్వే రెవెన్యూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలు తాహశీల్దార్లు ఆర్‌ఐలు, వీఆర్‌ఓలు ఆర్‌డిఓ స్థాయిలో క్షేత్ర స్థాయిలో రైతులకు సంబం ధించిన సమస్యలు ఏ విధంగా పరిష్కరిస్తున్నారో మళ్ళీ మళ్ళీ సమస్య లుత లెత్తకుండా తాను ఈ గ్రామానికి వచ్చానని కలెక్టర్ వివరించారు.ఈ గ్రామంలో రీ సర్వే వలన జాయింట్ ఖాతాతలు, వన్‌బి సమస్యలు,భాగపరిష్కారం, సాదాబైనాబి అయి సాగులో ఉన్న వారికి పట్టాలు లేకపోవటం వంటి తన దృష్టికి వచ్చిందని కలెక్టర్ వెంకటేశ్వర్లు వివరించారు.

# గూడూరు డివిజన్

## పరీక్షా సామాగ్రి అందజేసిన డిఎస్పీ



గూడూరు, మార్చి 13 ప్రభాతవార్త : మహిళా దినోత్స వాలను పురస్కరించుకొని గురువారం ఆరవ వెంకటమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏపీ బాలికల గురుకుల పాఠశాల జానకిరావుపేట, గూడూరు నందు పదవ తరగతి పరీక్షలకు వెళుతున్న 46 మంది విద్యార్థి నులకు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ పి.గీతా కుమారి డిప్యూటీ సూపరిన్ టెండెంట్ ఆఫ్ పోలీస్ గూడూరు వారి చేతుల మీదుగా పరీక్షా సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో అరవ వెంకటమ్మ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ ఆరవ పార్వతయ్య, జిల్లా సభ్యులు విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ తిరుపతి జిల్లా వారు స్పాన్సర్ చేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సి పల్ ఏ. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో 458వ నేత్రదానం



సూళ్లూరుపేట, మార్చి 13 ప్రభాతవార్త : పట్టణంలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థకు గురువారం 458వ నేత్రదానం అందింది. బాపూజీవీధికి చెందిన సోమిశెట్టి అనసూమయ్య మృతిచెందడంతో కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాల నుంచి కార్నియాలను సేకరించారు. చెన్నై శంకర్ నేత్రాలయకు పంపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## రుణాల లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు



తడ, మార్చి 13 ప్రభాతవార్త : తడ మండలం లోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకు అధికారులు, మండలస్థాయి అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహిం చారు. మొత్తం 63 యూనిట్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కోసం ఈ ఇంటర్వ్యూలు జరిపారు. తడ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులు ఎంపిక చేసిన వివిధ గ్రామాల లబ్ధిదారుల కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు.

## పని ఒత్తిడి తగ్గించండి సారూ

**- పంచాయతీ కార్యదర్శుల ఆవేదన**



తడ, మార్చి 13 ప్రభాతవార్త: పని ఒత్తిడి పెరిగి పోయిందని, తమ సమస్యలు కూడా పరిష్కరించాలని తడ మండల పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఎంపిడిఓ విజయకుమార్‌కు వినతిపత్రం అంద జేశారు. సచివాలయాల నిర్వహణ, సర్వేలు పూర్తి చేయడంలో ఎదురవుతున్న సమస్యలు, ఇతర ఇబ్బందుల పరిష్కారం కోసం ఈ వినతిపత్రం అందజేశారు. పంచాయతీరాజ్ వ్యవస్థలోని గ్రామస్థాయి పరిపాలనలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమైందని, అయితే ఇటీవల పనిభారం పెరగడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. పంచాయతీ కార్యదర్శులను గుర్తించి పరి పాలనలో అనుభవం కలిగిన వారిని గ్రామ సచివాలయ కన్వీనర్లుగా, డీడీఓలుగా అదనపు నిధులు కేటాయించారని, ప్రస్తుతం ఏర్పాటైన కూటమి ప్రభుత్వం స్పష్టమైన విధి విధానాలతో ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులను మార్చి రాష్ట్రం స్వయంసంవృద్ధి సాధించాలన్న లక్ష్యంతో పనిచేస్తోందని, అయితే ఇటు వంటి ప్రతిష్టాత్మక పనులతో పాటు ఇతర శాఖల ప్రతి సర్వేలోను కార్యదర్శులను భాగస్వాములు చేయడం వలన పని ఒత్తిడి పెరిగిందన్నారు. గతంలోపంచాయతీ పరిపాలనకు మాత్రమే తమను పరిమితం చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు.

## టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేయండి

**- అసెంబ్లీలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ**



సూళ్లూరుపేట, మార్చి 13 ప్రభాతవార్త : నియోజకవర్గంలో 90 శాతం పూర్తయి ఉన్న టిడ్కో గృహాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ గురువారం అసెంబ్లీలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2014-19 సంవత్సరాల్లో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టిడ్కో ఇళ్లను నిర్మింపచేశారని, వాటిని గత వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు ఇవ్వకుండా నిలిపేసిందని తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లను అప్పటి లబ్ధిదారులకు అందజేస్తారన్న ఆశలతో ప్రజలు ఉన్నారని తెలిపారు. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. పాత లబ్ధిదారులకు అందజేస్తారా లేక తిరిగి మళ్లీ నూతన లబ్ధిదారులను ఎంపిక చేస్తారా అనే విషయాన్ని సంబంధిత మంత్రి నారాయణ తెలియజేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మొత్తం సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీల పరిధిలో 4,720 ఇళ్లు ఉన్నాయని ఆమె చెప్పారు. ఇందుకు సంబంధించి మంత్రి నారాయణ జూన్ నెలకు ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు.

## చిత్రాడ సభకు బయలుదేరిన జనసైనికులు



గూడూరు, మార్చి 13 ప్రభాతవార్త : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్స వాన్ని పురస్కరించుకుని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు గురు వారం ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర రావు, జనసేన పార్టీ గూడూరు నియోజక వర్గం పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ పిఒసి కె.మోహన్ ఆధ్వర్యంలో పట్టణంలోని గమల్లపాలెం లోని గూడూరు నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయం నుండి జనసేన నాయకులు,కార్యకర్తలు, జనసైనికులు పలు వాహనాల్లో భారీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పాలిచర్ల భాస్కర్, గోనూ క్రాంతి కుమార్ పట్టణ కార్యదర్శి ఉప్పు సాయి కిరణ్, వంశీ,కుమార్, చిలుకూరు మండలం నాయకులు కార్తీక్, మహేష్, రవి, సుధీర్, శివాజీ, కోట మండలం నాయకులు గురుబాబు, కోటయ్య చిట్టమూరు నాయకులు అక్బర్ కుమార్, భాస్కర్ వాకాడు నాయకులు సునీల్ జనసైనికులు సనత్, నవీన్, విజయ్, మస్తాన్, శ్రీనివాసులు, మురళి, విశ్వ, స్వరూప్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

## 19 కోట్లు విద్యుత్ బకాయిలు

కోట, మార్చి 13 ప్రభాతవార్త: కోట విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో 19 కోట్ల రూపాయలు విద్యుత్ బకాయిలు రావాల్సి ఉందని సబ్ డివిజన్ ఎడి చిన్నయ్య చెప్పారు. సబ్ డివిజన్ పరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో అన్ని రకాల ప్రభుత్వ సంస్థల నుంచి 19 కోట్ల రూపాయలు, ఆక్వా కల్చర్ నుంచి 44 లక్షల రూపాయలు విద్యుత్ బకాయిలు రావలసి ఉందన్నారు. ఆక్వా రైతులు సహకరించి త్వరితగతిన బిల్లులు చెల్లించాలని ఆయన కోరారు.

## 15న ప్రజా దర్బార్

బాలాయపల్లి, మార్చి 13 ప్రభాతవార్త :బాలాయపల్లి స్త్రీ శక్తి భవనంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ప్రజా దర్బార్ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ తెలిపారు. సమస్యలను వినతి పత్రాలు ద్వారా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు సమర్పిస్తే పరిష్కరిస్తానని చెప్పారు. ప్రజా దర్బార్‌కు మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

## సాగరమాల రోడ్డు వద్ద పైపులైన్లు పరిశీలన



కోట, మార్చి 13 ప్రభాతవార్త: కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామం మీదుగా సాగరమాల రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఇందులో భాగంగా పైపులైన్లు రోడ్డు కింద ఉండటంతో పలు పైపులైన్లు దెబ్బతిన్నాయి. ఆ మేరకు రోడ్డు నిర్మాణం ఎంత మేరకు ఉందో అంత వరకు ఎన్ని పైపులు అవసరమ వుతా యనే దానిపై గురువారం ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ నందకుమార్ ఆ గ్రామానికి వెళ్లి పరిశీలించారు. ఇటీవల సాగరమాల రోడ్డు నిర్మాణం క్రమంలో పలు పైపులైన్లు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో ఎంతమేరకు పైపులైన్లు అవసరమ వుతాయి అనే దానిపై ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని ఆయన ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ అరవింద్‌ను కోరారు.

## పి4 సర్వే నూరుశాతం పూర్తి



కోట, మార్చి 13 ప్రభాతవార్త: పేదరికం లేని సమాజ స్థాపనకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రజావ సరాలు తెలుసుకొని వాటిని సమకూర్చే ందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా పి4 సర్వేను కోట మండలంలో నూరుశాతం పూర్తి చేశారు. 27 అంశాలతో సచి వాలయ సిబ్బంది లబ్ధిదారుల వివరాలు సేకరించారు. ఇంటి నంబర్, యాజమాని పేరు, ఆధార్ సంఖ్య, కుటుంబ సభ్యుల్లో చదువుకున్న వారు, సంపాదనపరులు ఎందరు, ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారా, ఇళ్లు ఏ రకం, బ్యాంకు ఖాతా, పట్టణాల్లో స్థలం ఉందా, ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయా, రక్షిత తాగునీరు సరఫరా అవుతుందా, ఇంట్లో గృహోపకరణాలు వివరాలు, వంటకు గ్యాస్ వాడుతున్నారా, విద్యుత్ బిల్లు ఎంత, గత రెండేళ్లలో ఆదాయ పన్ను చెల్లించారా అనేవి యాప్‌లో నిక్షిప్తం చేశారు. కోట మండలంలో వంద శాతం సర్వే పూర్తయినట్లు ఇన్‌ఛార్జ్ ఎంపిడిఓ గోపి తెలిపారు.

## సేంద్రియ ఎరువుల ద్వారా నేల ఆరోగ్యం



వెంకటగిరి, మార్చి 13 ప్రభాతవార్త: సేంద్రియ ఎరువుల ద్వారా నేల ఆరోగ్యంగా ఉంటుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజీవ తెలిపారు. ఫర్మేంటెడ్ సేంద్రియ ఎరువు వినియోగం పై రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా శాస్త్రవేత్త మాట్లా డుతూ సేంద్రియ ఎరువుల వినయోగం వలన నేల ఆరోగ్యం మెరుగు పడుతుందని తెలిపారు. నేల ఆరోగ్యంగా ఉంటే పంట దిగుబడి పెరుగుతుంది అని, ఫర్మేంటెడ్ సేంద్రియ ఎరువు రైతులకు సేంద్రియ ఎరువులు లభ్యత తక్కువ వున్న ప్రస్తుత తరుణంలో వినియోగించదగిన ఎరువు అని తెలియ చేయడం జరిగింది. శాస్త్రవేత్త విజయశ్రీ సేంద్రియ విధానంలో పండించిన పంటల వలన ఆరోగ్యమైన ఆహారం లభిస్తుంది అని తెలియజేసారు. మహీంద్రా ప్లాంట్ ఇంచార్జి, నాగూర్ బాషా సేంద్రియ ఎరువు తయారీ మీద అవగాహనా కల్పించారు. కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త నాగార్జునరెడ్డి రైతులు పాల్గొన్నారు.

## స్విమ్స్‌చే మహిళలకు మామోగ్రామ్, పాప్ స్మియర్ పరీక్షలు



వెంకటగిరి, మార్చి 13 ప్రభాతవార్త : తిరుపతి శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో చిల్లకూరు పిహెచ్‌సి పరిధిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రారంభమైనట్టు వైద్యాధికారి డాక్టర్ షాలోమ్ అరాఫత్ తెలిపారు. పింక్ బస్సుల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో భాగంగా గురువారం చిల్లకూరు పిహెచ్‌సి పరిధిలో గల కడివేడు, ముత్యాలపాడు గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది. బిపి, షుగరు పరీక్షలతోపాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ చైతన్యభాను, డాక్టర్ పద్మావతి, సర్పంచులు వెంకటమ్మ, హరిత, పంచాయతీ కార్యదర్శులు అలీభాషా, రమాదేవి, స్థానికనాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసు లురెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, సూపర్వైజర్లు రవికుమార్, ముని లక్ష్మమ్మ, ఎంఎల్ హెచ్‌పిలు జీవిత, ప్రత్యూష, ఏఎన్‌ఎంలు వెంకట రత్నమ్మ, శాంతకుమారి, స్థానిక వైద్య

## నూతన నాయి బ్రాహ్మణ కమిటీని ఎన్నిక



గూడూరు, మార్చి 13 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ నాయి బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు వైద్యం శాంతారామ్ జన్మదినం పురస్కరించుకుని గూడూరు టిడిపి పార్టీ కార్యాలయంలో జరుపుకోవడం ఆనందంగా ఉందని నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. గూడూరు పట్టణంలోని టిడిపి పార్టీ కార్యాలయంలో వైద్యం శాంతారామ్ పుట్టినరోజు సందర్భంగా నాయి బ్రాహ్మణులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గోపాల్ ఆధ్వర్యంలో నాయిబ్రాహ్మణ సంఘం గూడూరు నూతన కమిటీని ఎన్నుకున్నారు నాయిబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ఎప్పుడు నాయి బ్రాహ్మణులు అండగా ఉన్నారని నాయీ బ్రాహ్మణులు అభివృద్ధికి టిడిపి అనేక పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్, మస్తాన్ గురునాథం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## తగిన ధృవ పత్రాలు లేకుంటే జరిమానా సిఐ

గూడూరు, మార్చి 13 ప్రభాతవార్త : పట్టణంలో గురువారం టౌన్ సిఐ శేఖర్ బాబు ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ని నియంత్రించారు. ఈ సందర్భంగా ధ్రువ పత్రాలు లేకుండా జరిమానా విధించారు. మోటార్ బైకులు, కార్లు, ఆటోవారిని ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, అలా పాటించకుండా, సరైన ధ్రువపత్రాలు లేకుండా, వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తే కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామని తెలియజేసారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డిఎస్పీ గీతా కుమారి సూచనల మేరకు ఈరోజు గూడూరు ఒకటవ పట్టణంలో వాహనాలను తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు.

## పది పంచాయతీల్లో వర్మికంపోస్టు ఎరువులు తయారీ



బాలాయపల్లి, మార్చి 13 ప్రభాతవార్త : మండలం లోని పది పంచాయతీల్లో వర్మి కంపోస్ట్ తయారీ చేస్తున్నట్లు ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు వర్మీ కంపోస్ట్ తయారిలో భాగంగా మండలంలోని 10 షెడ్లకు వానపాములు వదిలే కార్యక్రమం చేపట్టారు. బాలాయపల్లి, నిండలి, అలిమిలి, వెంగమాంబపురం, కయ్యూరు, కాట్రా గుంట, సిద్ధగుంట, కామకూరు, హస్త కావేరి, జయంపు వర్మీ కంపోస్ట్ ద్వారా పంచాయతిలకు ఆదాయం వస్తుందని తెలిపారు. పంచాయతీ ఈవోపీఆర్ డి.మోహన్‌రాజు, కార్యదర్శి లీలావతి, పంచాయతీ సర్పంచ్ అంజలి కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గురుకుల విద్యార్థులతో ముచ్చటించిన డీఎస్పీ

గూడూరు, మార్చి 13 ప్రభాతవార్త : పట్టణ పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాలను డిఎస్పీ గీతా కుమారి సందర్శించారు. ఆమె పదవ తరగతి పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థినీలతో కొంత సమయం ముచ్చటించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ సమాజంలో మహిళలకు విద్య అవసరం చాలా ఉందని, ఏకాగ్రతతో చదవడం వల్ల మంచి ఫలితాలు సాధిస్తారని అన్నారు. సాధన చేయడం వల్ల భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదుగుతారని విద్యార్థినీలకు బోధించారు.

## సత్వరం శక్తి టీమ్‌లు ఏర్పాటు

**- నేర సమీక్షా సమావేశంలో పోలీసులతో ఎస్పీ మణికంఠ చందోలు**



చిత్తూరు, మార్చి 13 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా శక్తి టీమ్‌లు ఏర్పాటు చేయాలని హోమ్ మంత్రి ఆదేశించడంతో జిల్లాలో సైతం శక్తి టీమ్‌లు సత్వరం ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలని ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు గెస్ట్‌హౌస్‌లో బుధవారం ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు అధికారులకు నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు విజిబుల్ పోలీసింగ్ పెంచేలా విధులు నిర్వర్తించాలని, ప్రజలతో సామ రస్యంగా, సఖ్యతతో వుంటూ చట్టంపై గౌరవం పెంపొందేలా మెలగాలన్నారు. అలాగే ఎర్రచందనం, నాటు సారా, ఇసుక అక్రమ రవాణా నేరస్తులపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో పాత నేరస్తులపై నిఘా వుంచాలని, రోడ్డు ప్రమాదాలను మరింత కట్టడి చేయడానికి మెరుగైన చర్యలు చేపట్టాలని, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా వుంచాలని, మహిళా పోలీసులతో మహిళలు, విద్యార్థినిలకు సమాజంలో జరిగే నేరాల పట్ల, సైబర్ క్రైమ్స్ పట్ల అవగాహన సదస్సులు నిర్వహించి వారిని చైతన్యవంతులను చేయాలన్నారు. అలాగే అసాంఘీక కార్యకలాపాలు అణచివేతకు డ్రోన్‌ల సహాయంతో నిఘా పెంచాలని, ఇప్పటికే సిబ్బందికి డ్రోన్ శిక్షణ ఇవ్వడం జరిగిందని, ఆధునిక సాంకేతికతను ఉపయోగించి నేర పరిశోధన, శాంతి భద్రతల పరిరక్షణ, భారీ సమావేశాల్లో భద్రతా చర్యలు చేపట్టడం వంటి విభిన్న దశల్లో డ్రోన్లు ఉపయోగపడుతాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా వుండాలని, ప్రతి ఒక్కరు సాంకేతికంగా అవగాహన కలిగి వుండాలని, అజ్ఞాత వ్యక్తుల నుండి వచ్చే సంక్షిప్త సందేశాలు, మెయిల్స్‌లోని లింకులను ఓపెన్ చేయకుండా తిరస్కరించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ పాటిస్తూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు. ఈ సమావేశంలో ఫిబ్రవరి నెలలో ఎన్‌ఫోర్స్ మెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్ పెక్టర్ జయరామయ్య, పుంగనూరు ఇన్స్ పెక్టర్ శ్రీనివాసులు, కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లులకు సిసి కెమెరాలు, ప్రసంశాపత్రాలను ఎస్పీ అందజేశారు. ఆపరేషన్స్ ఎఎస్పీ, ఇన్‌ఛార్జీ అడ్మిన్ ఎఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, జిల్లాలోని డిఎస్పీలు, సర్కిల్ ఇన్స్ పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## పేరూరులో అక్రమ నిర్మాణాలు కూల్చివేత



తిరుపతిరూరల్, మార్చి13 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం పేరూరు గ్రామ పంచాయతీలో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరఢా ఝుళిపించారు. పేరూరు రెవెన్యూ గ్రామ లెక్కదాఖల సర్వేనెంబర్ 460/2, 488లో గల కాలువ పోరంబోకు ప్రభుత్వ భూమిలో నిర్మితమైన 11అక్రమ నిర్మాణాలను గురువారం తెల్లవారుజామున రెవెన్యూ అధికారు లు తొలగించాలరు. ప్రభుత్వ భూములలో అక్రమ నిర్మాణాలు చేపట్టితే చర్యలు తప్పవని తిరుపతిరూరల్ తహశీల్ధార్ బి.రామాంజుల నాయక్ హెచ్చరించారు.

## మహిళా వర్సిటీలో ముగిసిన విరించి సంబరాలు



తిరుపతి విద్య, మార్చి 13 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాల యంలో ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో విరంచి 2025 రెండు రోజుల కార్యక్రమం ముగింపు వేడుకలు గురువారం ఇందిర ప్రియదర్శిని ఆడిటోరి యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం ఉపకళపతి ఆచార్య రాణి సదాశివమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశ సంస్కృతి,వైవిధ్యం ప్రాముఖ్యత గురించి వివరించారు.ప్రతి ఒక్కరి జీవితంలో కీలక పాత్ర పోషించే ఆధ్యాత్మిక ఫిట్‌నెస్ అంశాలు ప్రస్తావించారు.ఈ కార్యక్రమంలో విసి ఆచార్య వి.ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజని, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య మల్లికార్జున రావు,అధ్యాపకులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

## మొల్లమాంబ విగ్రహానికి పాలాభిషేకం



తిరుపతి(రవాణ), మార్చి 13ప్రభాతవార్త: కవయిత్రి మొల్లమాంబ జయంతిని పురస్కరించుకుని గురు వారం ఉదయం మొల్లమాంబ కళాపీఠం ఆధ్వర్యంలో పాలాభిషేకం జరిగింది. వ్యవస్థాపక అధ్యక్షుడు కేశవ్ వడియార్, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి,కళాకారులు కెవెన్ రాజా, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, శాంబులు హరినాథ్, కస్పా పద్మనాభమ్, రాజశేఖరరెడ్డి, చిత్రపు హనుమంతరావు, కేశవులు,హరినాధరెడ్డి తదితరులు ఆమె విగ్రహానికి పాలాభిషేకం పుష్పాంజలి ఘటించారు. ఆమె సేవలను కొనియాడారు.

## విద్యుత్ కోతలతో అన్నదాత కుదేలు



పాకాల, మార్చి 13 ప్రభాతవార్త: పాకాల మండలంలోని అన్నదాతలకు రోజుకు 9 గంటల పాటు పగలు ఇస్తున్న విద్యుత్తులో అనేక సార్లు అనధికారిక కోతలు విధిస్తున్నారు. దీనికి తోడు లో వోల్టేజ్ సమస్య రైతులకు ఇచ్చే విద్యుత్ అంటే మండలం లోని విద్యుత్ అధికారులకు చిన్న చూపులా అనిపిస్తోంది. ఒక వైపు ఇప్పటికే రైతులు కూలీలు దొరక్క అడవి జంతువులతో వ్యవసాయం చేయలేక అనేక ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం నుంచి 9 గంటల పాటు నిరంతరాయంగా ఇవ్వా లని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ పాకాల మండలంలో అమలు కావడం లేదు. గంటకు కనీసం మూడు నుంచి ఐదు సార్లు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. ఇదేమిటి అని అడిగితే సిబ్బందిని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతారు. లో వోల్టేజ్ వలన రైతుల స్టార్టర్లు, మోటర్లు తరచూ కాలిపోతున్నా పట్టించుకొనే నాథుడే లేక పంటలు పండించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతుల సమస్యలపై ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కరెంటు కోతలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మతసామరస్యానికి ప్రతీకగా హోలీ : జిల్లా ఎస్పీ



తిరుపతి కార్పొరేషన్, మార్చి 13 ప్రభాతవార్త: మతసామరస్యానికి ప్రతీకగా హోలీ పండుగ జరుపుకుందామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పిలుపు నిచ్చారు. హోలీ పండుగ సందర్భంగా రంగులు చల్లు తుంటారు. ఎదుటివారికి రంగులు పూయడం, మహిళలపై రంగులు చల్లి అసభ్యంగా ప్రవర్తించడం వద్దన్నారు. ఇతరుల మనోభావాలకు ఇబ్బంది పెట్టే విధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. అదేవిధంగా ముఖ్యంగా హోలీ పండుగ జరుపుకునేటప్పుడు యువత మరొకరికి ఆదర్శంగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనాల్లో వెళ్లేటప్పుడు అతివేగంగా ప్రయాణిస్తూ సైలెన్సర్లు ఉడతీసి అతివేగంగా వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. హోలీ పండుగ ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకునే విధంగా అందరూ ప్లాన్ చేసుకోవాలని తిరుపతి జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఫాల్గుణ నిండు పున్నమి వేళ....  
ఆకసమున మెరయు సుక్కల  
వోలె.... శిశిరకాంతల  
ముక్కుపుడకల రీతి...  
ఉద్భవించేనవిగో వృక్షరాజ  
పుత్రికలు...  
తోట కంతటికీ శోభనిచ్చెడి  
'మావి' పిందెలు....  
ఘుమఘుమల రుచులు  
భావిజగతి నింపబోవంగా.....

– పరాంకుశ,  
ప్రభాతవార్త ప్రతినిధి,  
పుంగనూరు.

## భక్తుల భద్రతకు హర్షవర్ధన్‌రాజు... టిటిడి సివిఎస్‌ఓగా అవకాశం

తిరుమల, మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి : తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజుకు టిటిడి భద్రత విభాగంలో అరుదైన అవకాశం లభించింది. టిటిడి ఇన్‌ఛార్జి సివిఎస్ఓగా కూడా ఆయనకు భాగ్యం కలిగింది. చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు నుండి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఇన్‌చార్జి సివిఎస్‌ఓగా అదనపు బాధ్యతలు స్వీకరించారు.

### గ్రామపంచాయతి కార్యాలయము, అరగొండ, చిత్తూరు జిల్లా

రే.క.నెం:07/2025 | **బహిరంగ వేలము ప్రకటన** | తేది:12.03.2025

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా అరగొండ గ్రామపంచాయితీకి చెందిన వారపు సంత మరియు దినసరి సంత యందు రుసుములను వసూలు చేసుకొను గుత్త హక్కులను, మరియు గ్రామ పంచాయితీకి చెందిన వాణిజ్య సముదాయముల రూము నెం: 01,02,03,04,05,06 నెంబర్లును (ఆరు గదులను) 2025-2026 ఆర్థిక సంవత్సరమునకు లీజు ఇచ్చుట కొరకు తేది: 20-03-2025 గురువారం ఉదయం 11 గంటలకు అరగొండ గ్రామపంచాయతీ కార్యాలయం నందు సదరు గ్రామ పంచాయతీ కార్యదర్శి గారిచే బహిరంగ వేలము వేయబడును. వేలములో పాల్గొను వారు ఈ క్రింది కనిన మేరకు డిపాజిట్టును పంచాయతీ కార్యదర్శి వారి వద్ద చెల్లించ వలయును.

| వ. నెం. | గుత్త వివరములు | డిపాజిట్టు మొత్తం రూ. | సాల్వెన్సీ మొత్తం రూ. | సాల్వెన్సీ లేనిచో డిపాజిట్టు మొత్తం రూ. |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 01. | దినసరి మార్కెట్టు | 1,50,000 | 1,00,000 | 1,50,000 |
| 02. | వారపు కూరగాయల సంత | 2,00,000 | 1,00,000 | 2,00,000 |
| 03. | షాపింగ్ కాంప్లెక్స్ రూము నెం: 01 | 1,00,000 | 50,000 | 1,00,000 |
| 04. | షాపింగ్ కాంప్లెక్స్ రూము నెం: 02 | 1,00,000 | 50,000 | 1,00,000 |
| 05. | షాపింగ్ కాంప్లెక్స్ రూము నెం: 03 | 1,00,000 | 50,000 | 1,00,000 |
| 06. | షాపింగ్ కాంప్లెక్స్ రూము నెం: 04 | 1,00,000 | 50,000 | 1,00,000 |
| 07. | షాపింగ్ కాంప్లెక్స్ రూము నెం: 05 | 1,00,000 | 50,000 | 1,00,000 |
| 08. | షాపింగ్ కాంప్లెక్స్ రూము నెం: 06 | 1,00,000 | 50,000 | 1,00,000 |

షరతులు:- (1) శ్రీ డివిజినలు పంచాయతీ అధికారి చిత్తూరు వారి ఉత్తర్వు రె.క.నెం: 96/2025/ఎ3(పం) తేది 11-03-2025 మరియు రె.క.నెం.95/2025/ఎ3 (పం) తేది 11-03-2025 మేరకు హెచ్చు పాటదారులకు వేలము ఖాయపరచిన తేదీ నుండి (7) రోజులు లోపు వారిచే పాడబడిన హెచ్చు పాట మొత్తమును ఏక మొత్తములో (సింగిల్ పేమెంట్) చెల్లించి మరియు నూటికి రూ.3/- వంతున స్టాంపు డ్యూటీతో రిజిస్టర్ అగ్రిమెంట్ చేసుకొనవలయును మరియు టీ.డీ.ఎస్, జి.ఎస్.టీలు చెల్లించి తగు రశీదులు పొందవలయును. అట్లు తప్పిన ఎడల హెచ్చు పాటదారుని ధరావత్తును గ్రామ పంచాయతీ నిధికి దండుగ క్రింద జమ చేసి రెండవ పాటదారునికి ఖాయపరచబడును. (2) వేలములో పాల్గొను వారి తరపున ఆథరైజేషన్ వ్యక్తులను అనుమతించబడదు. (3)వేలములో పాల్గొనదలచిన వారు గ్రామపంచాయతీకి ఏలాంటి బాకీ వుండరాదు. (4) వేలమును ఏలాంటి కారణము చూపకనే నిలుపుదల చేయుటకు, గాని వాయిదా వేయుటకు, మరియు రద్దు చేయుటకు పంచాయతీ కార్యదర్శి వారికి పూర్తి అధికారములు కలిగియున్నారు. (5) ఇతర వివరములకు గ్రామ పంచాయతీ కార్యాలయము పనివేళలలో తెలుసుకొనవచ్చును.

టి.మల్లుదొరై  
సర్పంచ్, అరగొండ గ్రామ పంచాయతీ, తవణంపల్లి మండలం

కె.మురుగేషన్  
పంచాయతీ కార్యదర్శి, అరగొండ గ్రామ పంచాయతీ, తవణంపల్లి మండలం